# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర వైపు తీసుకెళ్లే బాధ్యతను తీసుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- ❖ అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

- ❖ విజయనగరం జిల్లా పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.

- ❖ మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పరిశ్రమల స్థాపనను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సి.ఎం.రమేష్ తెలిపారు.

==============================

రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర వైపు తీసుకెళ్లే బాధ్యతను తీసుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడ పటమటలోని దత్త పీఠాన్ని ఈరోజు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామితో చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. అనంతరం రాష్ట్రంలోని 42 ప్రాంతాల్లో చేపట్టబోయే దత్త క్షేత్రనాథ్ యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక భావన మనలో ఉండాలన్నారు. ఇప్పుడు విజన్-2047 గురించి ఆలోచిస్తున్నామని, ప్రజలు సంతోషంగా ఉండేందుకు ఈ విషయంలో ముందుకు వెళ్లడమే తప్ప వెనకడుగు వేసేది లేదన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలని ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు.

==============================

అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. గుంటూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈ రోజు అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం, సావిత్రీ బాయ్ పూలే ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రీ బాయ్ పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, పూర్వ విద్యార్థులు బహుకరించిన రెండు నూతన బస్సులను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 5 లక్షలమంది అవయవ దానం కోరుతూ.. జీవన్ దాన్ ట్రస్ట్ లో నమోదు చేసుకుంటే, కొంత మందికి మాత్రమే దాతల నుండి కార్నియా, కిడ్నీలు వంటివి లభిస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితి మార్చటం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవయవదానంపై అవగాహన

పెంచటంతో పాటు అవయవదానం చేసిన వారికి 10 వేల రూపాయల ప్రోత్సాహకాన్ని కూడా అందిస్తున్నామని మంత్రి వివరించారు.

==============================

విజయనగరం జిల్లా పర్యాటక అభివృద్ధిలో తొలి అడుగు పడిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గంట్యాడ మండలంలోని తాటిపూడి రిజర్వాయరులో పర్యాటక అభివృద్ధిలో భాగంగా సాహస జలక్రీడలను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సుమారు 5 కోట్ల రూపాయల వ్యయంతో బోటింగ్ ఏర్పాట్లు చేస్తోందన్నారు. రిజర్వాయర్ అవతల ఉన్న దిగువ కొండపర్త గ్రామ గిరిజనుల కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో బోటు సౌకర్యాన్ని కూడా త్వరలోనే పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతామని మంత్రి వెల్లడించారు.

==============================

బుడమేరు వరద నియంత్రణపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పురపాలక శాఖ మంత్రి నారాయణ ఈ రోజు సమీక్ష నిర్వహించారు. భవిష్యత్‌లో విజయవాడకు వరద సమస్య లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... బుడమేరు వరద నియంత్రణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సమగ్ర నివేదిక అందించేలా నీటిపారుదల, పురపాలక, రెవిన్యూ శాఖల అధికారులతో సమీక్ష చేశామని తెలిపారు. బుడమేరు డైవర్షన్ కెనాల్‌ను 37 వేల 500 క్యూసెక్కులకు పెంచేలా పెండింగ్ పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని పేర్కొంటూ…

(వాయిస్ 33 సెకన్లు)

==============================

ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనస్వాగతానికి ఏర్పాట్లు చేయాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సి.ఎం.రమేష్ తెలిపారు. ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై ఈ రోజు కలెక్టరు కార్యాలయలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చొరవతో జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేస్తోందని, రెండు లక్షల కోట్లు రూపాయలు పెట్టుబడులతో పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. పత్యక్షంగా పరోక్షంగా సుమారు 70 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయని అన్నారు. మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించడం జరుగుతుందని, దానివలన ఉద్యోగావకాశాలు పెరుతాయని అన్నారు.

విరామం

==============================

భారత నావికాదళ విన్యాశాలు రేపు విశాఖ తీరంలో జరగనున్నాయి. తూర్పు నౌకాదళ కమాండ్ నేతృత్వంలో యుద్ధనౌకలు, జలాంతర్గాములు, విమానాలు, నౌకాదళ బృందం, మెరైన్ కమాండోల ప్రదర్శనలతో కూడిన కార్యకలాపాల ద్వారా భారత నావికాదళం యొక్క అధునాతన సామర్థ్యాలను ఈ విన్యాసాలు ప్రదర్శిస్తాయి. ఈ కార్యక్రమలో ఈస్ట్రన్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు పాల్గొననున్నారు.

==============================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా కుప్పం నియోజక వర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఈరోజు ఏర్పాట్లను కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఈనెల 5వ తేదీ నుండి మూడు రోజుల పాలు కుప్పం, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారని తెలియజేశారు.

=============================

క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతో దోహదం చేస్తాయని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. లూయి బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని ఈ రోజు ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని అంధులకు నిర్వహించిన క్రీడాపోటీలను ఆమె ప్రారంభించారు. ఒంగోలులోని డి.ఆర్.ఆర్.ఎం.మున్సిపల్ పాఠశాల మైదానంలో నిర్వహించిన ఈ క్రీడలలో రెండు జిల్లాల నుంచి 100 మంది అంధులు పాల్గొన్నారు. వీరికి రన్నింగ్, షాట్ పుట్, క్రికెట్, క్యారమ్స్ వంటి వివిధ క్రీడలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయి బ్రెయిలీ అన్నారు.

=============================

అంతర్జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్‌ను వేదికగా తయారు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో అంతర్జాతీయ తైక్వాండో అథ్లెట్స్, క్రీడాకారులు ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తైక్వాండో అభివృద్ధికి కల్పించాల్సిన మౌలిక వసతులు, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలపై శాప్ ఛైర్మన్ తో చర్చించారు. అనంతరం రవినాయుడు మాట్లాడుతూ... క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, త్వరలోనే ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేలా కృషి చేస్తామని తెలిపారు.

=============================

బాల్య వివాహాలు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సావిత్రి బాయి పూలే... అట్టడుగు వర్గాలు, మహిళల విద్య కోసం చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర బీసీ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. ఈ రోజు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రి భాయీ పూలే మహిళా, బాలికల విద్య కోసం ఎంతో కృషి చేశారన్నారు. దేశంలోనే మొట్టమొదటి బాలికా పాఠశాలను ఆమె నెలకొల్పారన్నారు. సామాజిక సంస్కర్తగా, రచయితగా స్త్రీల హక్కుల కోసం పోరాడిన ధీశాలని పేర్కొన్నారు.

=============================

పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో వికలాంగుల పెన్షన్లు పంపిణీపై అధికారులతో ఈ రోజు నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న ఆయన యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో వికలాంగుల పెన్షన్ల పై జరిగిన సర్వేపై ఆరా తీశారు. జిల్లాలో 26 వేల మంది వికలాంగులు పింఛన్లు పొందుతున్నారని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు వారి మండలాలలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేయాలని, పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

=============================

స్త్రీ విద్యపై గళమెత్తిన ఉద్యమకారిణి, ఆదర్శ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నివాళులు అర్పించారు. కుల వ్యవస్థకు, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమించిన సావిత్రిబాయి స్ఫూర్తి అందరికీ ఆదర్శమని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

=============================
=============================